క్లుప్తంగా

రేపు ఉచిత వైద్య శిబిరం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సంపతికోటలో శనివారం వైద్య శిబిరం జరుగునని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులోని వైదేహీ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి వారి సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొంటారని పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజశేఖర్ సూచించారు.

పోతుపేటలో అధికారుల పర్యటన

పెద్దతిప్పసముద్రం: మండల తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఆర్ఐ చినపరెడ్డి, వీఆర్వో రత్నమ్మ గురువారం మండలంలోని పోతుపేట సందర్శించారు. పోతుపేట ఎస్సీ కాలనీకి చెందిన కేవీ రమణ స్మశానానికి దారి లేక మృతి చెందిన శవాలను కాలిబాటలో అష్ట కష్టాలు పడుతూ మోసుకుంటూ వెళ్లే విధానాన్ని చిత్రీకరించి జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్‌కు వ్యాట్సాప్ ద్వారా సందేశాన్ని పంపారు. సమస్యపై స్పందించిన జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు పోతుపేటకు వచ్చి విచారించారు. కాలనీలో 56 కుటుంబాల ప్రజలు జీవనం సాగిస్తున్నారని 762 సర్వే నంబర్‌లో దళితులకు స్మశానవాటిక ఉన్నా దారి సౌకర్యం లేదని ప్రజలు అధికారులకు వివరించారు. నాలుగు తరాల క్రితం స్మశానికి వెళ్లేందుకు బండిబాటలా ఉండేదని, ఇప్పుడు కాలి బాటగా మారిందన్నారు. ప్రత్నామ్యాయంగా దారి సౌకర్యం కల్పించాలని కాలనీ వాసులు అధికారులను కోరారు. సర్వే చేయించి స్మశానానికి దారి సౌకర్యం కల్పించేందుకు చొరవ చూపుతామని అధికారులు హామీ ఇచ్చారు.

బెట్టింగ్‌లకు దూరంగా ఉండండి



నగేష్‌తో హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: యువత క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని విజయవాడకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి, ఆలిండియా వాక్ యువకుడు నగేష్ సూచించారు. గురువారం మదనపల్లెకు వచ్చిన నగేష్‌కు హెల్పింగ్‌మైండ్స్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి సంఘీభావం ప్రకటించారు. నగేష్ మాట్లాడుతూ యువకులు బెట్టింగ్ యాప్స్ ద్వారా చాలా మంది యువకులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇకనైనా బెట్టింగ్‌యాప్స్‌కు దూరంగా ఉండాలని చదువుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. ఆయన వెంట హెల్పింగ్‌మైండ్స్ సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్, సభ్యులు ఆనంద్, చరణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల మార్పిడితో అధిక దిగుబడి



ఏఓ జాఫర్

రామసముద్రం: వ్యవసాయంలో పంటల మార్పిడి పద్ధతిలో సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మండలం వ్యవసాయాధికారి జాఫర్ పేర్కొన్నారు. రామసముద్రం మండలం వ్యవసాయాధికారిగా జాఫర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఏఓ మోహన్‌కుమార్ సాధారణ బదిలీల్లో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లా కంబదూరు మండలంలో పని చేస్తున్న జాఫర్ రామసముద్రం ఏఓగా వచ్చారు.

బ్రాహ్మణ చెరువులో ఫిష్‌పాండ్ పరిశీలన

కలికిరి: మండలంలోని పారపట్ల సమీపంలో గల బ్రాహ్మణ చెరువులో ఫిష్‌పాండ్ (చేపల చెరువు) పనికి ఎక్సకవేటర్ ఉపయోగించినట్లు సాక్షిలో ప్రచురితమైన 'యంత్రాలకు ఉపాధి' కథనంపై ఉపాధి హామీ అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం పారపట్ల దగ్గరున్న బ్రాహ్మణ చెరువు వద్దకు కలికిరి క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసులు, ఏపీఓ మంజుల ఎక్సకవేటర్‌తో జరిగిన ఫిష్‌పాండ్ పనిని పరిశీలించారు. గ్రామస్తులను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు. మస్టరులో పేర్లున్న కూలీలను, స్థానికులను విచారించి వివరాలు నమోదు చేయనున్నట్లు ఏపీడీ తెలిపారు. అయితే యంత్రంతో పనులు చేయించిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను వెంటపెట్టుకుని విచారించడంతో వాస్తవాలు ఎలా బయటకు వస్తాయని స్థానికంగా చర్చనీయాంశమైంది.

వెటర్నరీ ఇన్‌చార్జి డీడీగా నీరజ



నీరజ

మదనపల్లె రూరల్ : పశు సంవర్ధకశాఖ మదనపల్లె డివిజనల్ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్‌గా నీరజ గురువారం బాధ్యతలు చేపట్టారు. వాల్మీకిపురం ఏడీఏగా పనిచేస్తున్న నీరజ, మదనపల్లె ఏడీఏగా వచ్చారు. మదనపల్లె ఏడీఏగా పనిచేస్తున్న విశ్వేశ్వరరెడ్డి, వాల్మీకిపురానికి బదిలీ అయ్యారు. మదనపల్లె డీడీగా పనిచేస్తున్న సత్యనారాయణ నెల్లూరు జిల్లా చింతలదీవి క్యాటిల్‌ఫామ్‌కు బదిలీ కావడంతో ఇన్‌చార్జి డీడీగా ఏడీఏ నీరజ అదనపు బాధ్యతలు చేపట్టారు.

పంటలకు పోషణ.. చీడపీడల నివారణ

ఎరువులు లేని వ్యవసాయాన్ని ఇంధనం అక్కరలేని పరిశ్రమలను ఊహించలేం. కానీ వాటి వినియోగమే ప్రధాన కాలుష్య కారకంగా మారింది. ఈ పరిస్థితిని మార్చేందుకు జీవ ఎరువులు, జీవ ఇంధనాల అవసరం ఏర్పడింది. ఇవి పంటలకు పోషణకు, చీడపీడల నివారణకు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్నాయి. ఆకులు, ఆవు మూత్రంతో జీవామృతం తయారు చేసి చీడపీడలను రైతులు కట్టడి చేస్తున్నారు. ఈ ప్రయోగం సత్ఫలితాలివ్వడంతో సాగులో ఖర్చులు తగ్గనున్నాయి.

- ఆకులు, ఆవు మూత్రంతో పంటలకు రక్షణ
- సేంద్రియ పద్ధతుల్లో దోమ, ఊజి తెగులు కట్టడి
- సత్ఫలితాలిస్తున్న వినూత్న ప్రయోగం



సేంద్రియ ఎరువులతో సాగు చేసిన టమాటా తోట

గుర్రంకొండ: జిల్లాలో పడమటి మండలాల రైతులకు ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధాన జీవానాధరమైన పంట టమాటా. టమాటా సాగులో వ్యాపిస్తున్న ఊజి, దోమ వైరస్, ఇతర తెగుళ్ల పంటలు పూర్తి స్థాయిలో దెబ్బతింటున్నాయి. దీంతో లక్షలాది రుపాయలను పంట సాగు కోసం ఖర్చుచేసి రైతులు నష్టపోతున్నారు. రసాయన మందులతో వైరస్‌లను కట్టడి చేయలేకపోతున్నారు. అయితే సహజసిద్ధంగా లభించే ఆకులు, ఆవు మూత్రంతో కసాయాన్ని తయారు చేసి చీడపీడలను రైతులు కట్టడి చేస్తున్నారు. ఈ ప్రయోగం సత్ఫలితాలివ్వడంతో అన్నదాతకు సాగులో ఖర్చులు తగ్గుతున్నాయి.

తయారీ విధానం

సీతాఫలం ఆకు, వేపాకులు, ఆవుమూత్రంతో కలిపాలి, మూడింటిని ఒక డ్రమ్ములో నీటిని పోసి మురగబెట్టాలి. వారం రోజుల నుంచి పది రోజుల వరకు డ్రమ్ముకుమూత ఉంచి బాగా మురగబెట్టాలి. ఆ తరువాత లీటర్ల ప్రకారం కొలచి పచికారి చేయాలి.

పిచికారి చేసే విధానం

ఒక ఎకరాకు నాలుగు లీటర్ల చొప్పున ఈ విశ్రమాన్ని వాడుకోవాల్సి ఉంటుంది. ఒకడ్రమ్ము నీటిలో రెండు లీటర్లు చొప్పున మిశ్రమాన్ని కలిపాలి. అలా రెండు డ్రమ్ముల నీటిలో మొత్తం నాలుగు లీటర్ల కలిపి టమాటా తోటలపై పిచికారి చేయాలి. లేదా సాధారణంగా తెగుళ్ల నివారణకు రైతులు వినియోగించే రసాయానికి మందుల్లో కూడా సగం మోతాలో ఈ కసాయాన్ని కలిపి కూడా పిచికారి చేసుకోవచ్చు.

తెగుళ్లపై ప్రభావం

ఈ కసాయాన్ని పంటలపై పిచికారి చేయడం వలన టమాటా పంటలను ఆవహించే పలు రకాల వైరస్, ఇతర క్రిమికీటకాలపై మంచి ప్రభావం చూపిస్తుంది. ముఖ్యంగా ఊజి, బూడిద తెగులు, కాయతొలుచుపురుగు, లద్దెపురుగు, దోమ, ఆకుముడత నివారణకు బాగా పనిచేస్తుంది. మిశ్రమాన్ని పచికారి చేసిన నాలుగు నుంచి ఐదు రోజుల లోపు ఫలితం కనిపిస్తుంది. ఈ పద్ధతి ద్వారా సాగు ఖర్చు భారం చాలా వరకు తగ్గించుకోవచ్చు.

ప్రయోజనాలివే..

దోమ నివారణ జరిగితే చెట్టు చిగుళ్లు బాగా నిలచి, పూత బాగా పట్టి కాయలు ఎక్కువగా కాస్తాయి. కాయ తొలుచుపురుగు నశిస్తే టమటాల్లో రంధ్రాలు పడకుండా నాణ్యమైన పంటను తీసుకోవచ్చు. ఆకుముడత రోగం నశిస్తే చెట్టు ఆకులు, కొమ్మలు ఏపుగా పెరిగి దిగుబడి ఎక్కువగా వస్తుంది. లద్దెపురుగు, ఊజి తెగులు ద్వారా దెబ్బతినే టమాటాలకు రంధ్రాలు పడకుండా కాపాడుకోవచ్చు. ఈ విధానం ద్వారా రోగాల బారిన పడనీయకుండా ఆరోగ్యకరమైన వాతావరణంలో మంచి దిగుబడి సాధించవచ్చు.

మూడేళ్లుగా వినియోగిస్తున్నాను



ఆకులు, ఆవు మూత్రంతో తయారు చేసిన కసాయాన్ని మూడేళ్లుగా వినియోగిస్తున్నాను. ప్రస్తుతం ఒకటిన్నర ఎకరాలో టమాటా సాగు చేశాను. ప్రస్తుతం కాయలు కోత దశలో ఉన్నాయి. చాలావరకు అన్ని రోగాల నివారణకు ఇదే విశ్రమాన్ని వినియోగిస్తున్నాను. అలాగే మామిడి తోటల్లో కూడా ఈ కసాయాన్నే పిచికారి చేశాను. మామిడిలో ఎలాంటి రోగాలు వ్యాపించలేదు.దీంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. రుపాయి కూడా ఖర్చు కాకుండా తయారు చేసుకోవచ్చు.

– నారాయణ, రైతు, మొరంపల్లె

మంచి ఫలితాలు వస్తున్నాయి



టమాటాలో ఊజీ, దోమ, ఆకుముడత తెగులు నివారణ కోసం రైతులు సేంద్రియ పద్ధతిలో తయారు చేసుకొంటున్న కసాయం మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఎంతో మంది రైతులు టమాటా, మామిడి తోటల్లో చీడ పీడ నివారణల కోసం వేలాది రుపాయలు ఖర్చుచేసి రసాయనికి ఎరువులు కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. సీతాఫలం ఆకు, వేపాకు, ఆవు మూత్రంతో తయారు చేసే మిశ్రమాన్ని పిచికారి చేయడం వలన చీడ పీడలను నివారిస్తున్నారు.

– రత్నమ్మ, వ్యవసాయాధికారి, గుర్రంకొండ

నిషేధిత భూములపై జేసీ సమీక్ష

బి.కొత్తకోట: మదనపల్లె డివిజన్‌లోని మండలాల్లో నిషేధిత భూముల జాబితాపై జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్ర సమీక్షించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన 11 మండలాలకు చెందిన తహసీల్దార్లతో వేర్వేరుగా సమీక్షించారు. ఆయా మండలాల్లో 22ఏ నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించడం కోసం సిద్ధమైన ప్రతిపాదనలు వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించి తహసీల్దార్లతో వాస్తవ పరిస్థితులపై చర్చించారు. అడంగల్ వెరిఫికేష్, రికార్డులను తనిఖీ చేసి పలు అంశాలపై నిర్ణయం తీసుకున్నారు.

200 లీటర్ల సారా ఊట ధ్వంసం

మదనపల్లె రూరల్ : బార్డర్ మొబైల్ పెట్రోలింగ్ పార్టీస్(బీఎంపీపీ) సిబ్బంది కురబలకోట మండలం అప్పినాయనపల్లె గ్రామం పెద్దబోడుగుట్ట కొండప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో 5 లీటర్ల సారా స్వాధీనంతో పాటుగా 200 లీటర్ల సారా ఊటను గుర్తించి ధ్వంసం చేసినట్లు సీఐ సత్య శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దాడుల్లో సారా బట్టీ నిర్వహిస్తున్న కురబలకోట మండలం అప్పినాయునిపల్లెకు చెందిన ఏ.వెంకటరమణ కుమారుడు ఏ.రఘుపతినాయుడు (54)ను అరెస్ట్‌చేసి మదనపల్లె ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు అప్పగించినట్లు తెలిపారు. గ్రామాల్లో నాటు సారా తయారీ చేస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న బీఎంపీపీ సిబ్బంది

సూపర్ సిక్స్ అమలులో చేతులెత్తేసిన బాబు

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేవీపల్లె : సూపర్ సిక్స్ అమలులో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులెత్తేశారని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఎద్దేవాచేశారు. గురువారం మాజీ ఎమ్మెల్యే మండలంలోని గుండ్రేవారిపల్లె క్రాస్ వద్ద మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండానే ఇప్పటికే హామీ అమలు చేసేశామని కూటమి నాయకులు చెప్పుకుంటున్నారని విమర్శించారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్, పెళ్లికానుకతోపాటు ఎన్నో పథకాలు ఇస్తామని విస్మరించారన్నారు. బాబు షూర్యిటీ – భవిష్యత్తు గ్యారంటీ అంటూ ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు.

పరామర్శ

మండలంలోని జిల్లేల్లమంద పంచాయతీ రాగలవారిపల్లెలో ఇటీవల మృతి చెందిన శంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కురవపల్లెలో ఇటీవల మరణించిన గుండ్రే కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కంటికి శస్త్ర చికిత్స చేపించుకున్న గర్నిమిట్టకు చెందిన రామకొండారెడ్డిన, మోకాళ్లకు శస్త్రచికిత్స చేపించుకున్న శెట్టిపల్లెవాండ్ల పల్లెకు చెందిన దండు వెంకటరమణారెడ్డిలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, నాయకులు జయరామచంద్రయ్య, కోర్టు సుబ్బారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, పి. ద్వారకనాథరెడ్డి, సిద్ధయ్య, రెడ్డెప్పరెడ్డి, డాబాబాబు, యల్లారెడ్డి, గణపతిరెడ్డి, నాగ, ఆంజినేయులు, గౌస్, యల్లయ్య, నాగేశ్వర, మహేశ్వర్‌రెడ్డి, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కలికిరి: మండలంలోని మునెల్లపల్లి గ్రామం రామాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లెల రామచంద్రారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. సమాచారం తెలుసుకున్న పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం వారి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. స్థానిక నాయకులు రఘు, అశోక్, నారదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం మండలంలో..

వాల్మీకిపురం మండలంలోని ఎగువబూడిదవేడులో సి.సావిత్రమ్మ ఇటీవల మృతి చెందారు. గురువారం ఆమె దశ దినకర్మ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. వాల్మీకిపురం ఉప సర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

సికెల్ సెల్ వ్యాధి నిర్ధారణకు పరీక్షలు చేసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

మదనపల్లె సిటీ: సికెల్‌సెల్ వ్యాధిని ముందుగా కనుగొనడానికి అవసరమైన రక్తపరీక్షలు చేసుకోవాలని వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక అమ్మచెరువుమిట్టవద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో ప్రపంచ సికెల్ సెల్ డే కార్యక్రమం నిర్వహించారు. సికెల్ సెల్ వ్యాధి అనేది సాధారణంగా వారసత్వంగా వచ్చే రుగ్మతల సమూహం, అత్యంత సాధారణ రకాన్ని సికెల్ సెల్ అనీమియా అంటారని తెలిపారు. ఇది ఎర్ర రక్తకణాల్లో కనిపించే లోపం వల్ల వస్తుందన్నారు. దీని వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. యాంటిబయాటిక్స్, అధిక ద్రవం తీసుకోవడం, ఫోలిక్‌యాసిడ్ సప్లిమెంట్స్ వల్ల నివారణ ఉండవచ్చన్నారు. వెలుగు సెక్రటరీ ఉదయమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, స్వీటీ పాల్గొన్నారు.

పీలేరు : గిరిజన తెగ ఆరోగ్య సమస్యల్లో ఒకటైన సికిల్‌సెల్ ఎనీమియాడేపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం తలపుల పీహెచ్‌సీ పరిధిలోని మద్రిమాకులపల్లెలో ప్రపంచ సికిల్ సెల్ డే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ అనిమియా ఒక దీర్ఘకాలిక వారసత్వపు జబ్బు అని తెలిపారు. లక్షణాలుబట్టి వ్యాధి నిర్ధారణ అయిన అనంతరం చికిత్సతో మెరుగుపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, రెడ్డెప్ప, ఏఎన్ఎం రెడ్డిబీ, సీహెచ్‌వో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పంచాయతీ అభివృద్ధి

పీలేరురూరల్ : సమష్టి కృషితో పీలేరు గ్రామ పంచాయతీని అభివృద్ధి చేస్తామని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పట్టణంలో 26 ఆర్‌వో ప్లాంట్లు ఉన్నాయని, వాటి ద్వారా ప్రతి రోజూ పేదలకు తాగునీరు అందించాలన్నారు. అయితే సిబ్బందికి ఆరు నెలలుగా జీతాలు అందలేదని తెలిపారు. ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయని, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, వార్డుమెంబర్లు మల్లికార్జునరెడ్డి, శ్రీనాథరెడ్డి, విక్టరీ, అబీద్, సాంబశివారెడ్డి, షాజహాన్, రమణ, కాలేషా, పరమేష్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సవరణలకు దరఖాస్తు చేసుకోండి

గుర్రంకొండ: రీసర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దుకోవడానికి, అలాగే భూ సవరణలకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ లక్ష్మీ ప్రసన్న సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో అమిలేపల్లె, మద్రిమాకులపల్లె, సరిమడుగు, మర్రిపాడు, సంగసముద్రం, శెట్టివారిపల్లె, అరిగెలవారిపల్లె, రామాపురం, టి.రాచపల్లె, ఖండ్రిగ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశామని తెలిపారు. ఆయా గ్రామాలకు సంబంధించి పలువురు రైతులు వెబ్‌ల్యాండ్ 2.0లో జాయింట్ పట్టాదారులుగా నమోదు అయ్యారని పేర్కొన్నారు. గతంలో భూయజమానులకు వారియొక్క భూములను విభజన చేయుటకు ప్రభుత్వం రూ. 500 రుసుముగా నిర్ణయించందన్నారు. ప్రస్తుతం ఈ సేవలను పొందుటకు రూ.50 గ్రామ సచివాలయాల్లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెలఖారులోగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశముందన్నారు. జాయింట్ పట్టాలను విభజన చేయించుకోవడం వలన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులుగా గుర్తించబడతారని తెలిపారు.

బి.కొత్తకోట: రీ సర్వే పూర్తయిన మండలంలోని గుమ్మసముద్రం, కోటావూరు, గోళ్లపల్లె, తుమ్మనంగుట్ట గ్రామాల్లోని రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం ఆయా సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ ఎ.బావాజాన్ గురువారం తెలిపారు. జాయింట్‌లో నమోదైన భూముల పరిష్కారం కోసం ప్రభుత్వం రుసుమును రూ.500 నుంచి రూ.50 తగ్గించిందని, ఈ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకుంటే జాయింట్ భూ సమస్యలను పరిష్కారిస్తామని తెలిపారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వరుడితో నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, నాయకులు

మదనపల్లె రూరల్ : నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ గురువారం పట్టణానికి చెందిన కేజీ కూరగాయల మండీ యజమాని దాదాపీర్ ఆత్మీయ ఆహ్వానం మేరకు ఆయన కుమార్తె షేక్ మెహరోజ్ వివాహ వేడుకలకు హాజరయ్యారు. కర్నాటక అసెంబ్లీ మాజీ స్పీకర్ రమేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డితో కలిసి నూతన వధూవరులు షేక్ మెహరోజ్, షేక్ మహమ్మద్ అబ్దుల్లాసలాంలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేణుగోపాల్, దాబా రమేష్, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, శంకర్‌నాయక్, లియాకత్ అలీ, కొత్తపల్లె మహేష్, శ్రీకాంత్, చెన్నా, సాదిక్, యాసిన్, జబ్బాబుల్లా తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి

తంబళ్లపల్లె: తంబళ్లపల్లెలో శనివారం జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పెషల్ ఆఫీసర్ అమరనాథరెడ్డి కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులు, ఉద్యోగులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధన చేయడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. సచివాలయాలు, పాఠశాలల్లో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అందరికి ముందుస్తు సమాచారం, శిక్షణతో కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి, ఎంఈఓ త్యాగరాజ, డాక్టర్ అనుపమ, గ్రామ సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల జీవో రద్దు చేయండి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

మదనపల్లె: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల మార్గదర్శకాలపై జారీ చేసిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మదనపల్లె పట్టణ వార్డు సచివాలయాల ఉద్యోగులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బదిలీలు, రేషనలైజెషన్ కోసం విడుదల చేసిన జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ జీవోపై గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు గుడి నాగరాజ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోతో సచివాలయం ఉద్యోగులకు ఇబ్బందిగా మారిందన్నారు. సచివాలయం ఉద్యోగులు స్వంత మండలం, మున్సిపాలిటీల్లో ఉద్యోగం చేయకూడదని నిబంధన ఉందన్నారు. సచివాలయం ఉద్యోగులకు ఇబ్బందిగా మారిందన్నారు. అందరిని సొంత మండలం, మున్సిపాలిటీల్లోనే బదిలీలు చే పట్టాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం కమిషనర్ ప్రమీలకు వినతిపత్రం అందించారు. యూనియన్ నాయకులు విజయకుమార్ రెడ్డి, శరత్ కుమార్ రెడ్డి, అభిషేక్ వినోద్ కుమార్, రాజారెడ్డి, హేమలత, నందిని, ఆనంద, హరి పాల్గొన్నారు.

అన్ని వర్గాల కోసం ఎమ్మార్పీఎస్ పోరాటం



మాట్లాడుతున్న దానియల్ మాదిగ

కలకడ : అన్ని వర్గాల కోసం పోరాటం చేసిం దని, ఎన్నో వర్గాలకు, పేదవారికి ఎన్నో పథ కాలు వచ్చేలా కృషి చేశామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి దానియల్ మాదిగ తెలిపారు. గురువారం కలకడ బస్టాండ్ ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగల సంక్షేమం కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేశామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి ఎమ్మార్పీఎస్. ఎంఎస్పీ కమిటీలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ, మండల స్థాయి కమిటీలను ఎన్నుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం సందర్భంగా జూలై, 7వతేదీన ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గడికోట వెంకటేసు, ఎమ్మార్పీఎస్ నాయకులు ముల్లంగి రెడ్డెప్ప, ముడివేడు శ్రీనివాసులు, అమరాల వెంకట్రమణ, హరినాథ, వర్ల రెడ్డెయ్య, రమణ పాల్గొన్నారు.

ఆస్పత్రి సిబ్బందిపై వేధింపులు ఆపాలి



హాస్పిటల్ సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న మాల మహానాడు నాయకులు

మదనపల్లె రూరల్ : పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందిపై వేధింపులు ఆపాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. హాస్పిటల్ సూపరింటెండెంట్, ఎస్సీ,ఎస్టీ కులాలకు చెందిన సిబ్బందిని వేధిస్తున్నట్లు సమాచారం రావడంతో గురువారం మాలమహానాడు నాయకులు ఆస్పత్రిలో వెళ్లి విచారించారు. ఈ సందర్భంగా పలువురు సూపరింటెండెంట్ వేధింపులపై మాల మహానాడు నాయకుల దృష్టికి తేవడంతో వెళ్లి మాట్లాడారు. ఎస్సీ,ఎస్టీ సిబ్బందిపై వేధింపులు ఆపాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందిని అక్కడే ఉంచి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు యమలా చంద్రయ్య, గుండా మనోహర్, మల్లెల మోహన్, ఎలక్ట్రిషియన్ మోహన్, ప్రశాంత్, కృష్ణమూర్తి, హరి నారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

పీలేరురూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నామని ఎంఈవో పద్మావతి పేర్కొన్నారు. స్థానిక నెహ్రూబజార్‌లోని మోడల్ ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులు చేరినట్లు ఎంఈవో పద్మావతి తెలిపారు. గురువారం విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు వెనక్కిరావడంతో ప్రస్తుతం మోడల్ పాఠశాలలో 184 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. హెచ్‌ఎం సద్దల రాజేశ్వరి, ఉపాధ్యాయులు చాముండేశ్వరి, రాణి, శెట్టి సుబ్రమణ్యం, అరుణ, మంజుల, వెంకటరమణ, సీఆర్పీలు పాల్గొన్నారు.

కార్మికుల వేదన.. అరణ్య రోదన

- పారిశుద్ధ్య కార్మికుల భవిష్యత్తు ఏమిటి?
- పర్మినెంట్ ఉద్యోగాలపై నీలినీడలు



మదనపల్లె మున్సిపల్ కార్యాలయం

మదనపల్లె: మదనపల్లె సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీలో దినసరి పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న 80 మంది బలిపశువులయ్యే పరిస్థితి కనిపిస్తోంది. గత ఐదు నెలల నుంచి వీరికి చెల్లించాల్సిన రూ.15వేల వేతనంపై ఇంకా స్పష్టత రాలేదని తెలుస్తోంది. ఆడిటర్లు వేతన చెల్లింపుకు అభ్యంతరం తెలిపిన విషయాన్ని సాక్షి వెలుగులోకి తీసుకురావడంతో కార్మికులకు అసలు వాస్తవాలు తెలిశాయి. దీంతో అప్పటి నుంచి పరిస్థితులు మారిపోతున్నాయి. మున్సిపల్ వర్గాల్లో, కార్మికుల్లో సాక్షి కథనం తీవ్ర చర్చనీయాంశమైంది. పారిశుద్ధ్య దినసరి కార్మికుల భవిష్యత్తు ఏమిటి అన్న చర్చ జరుగుతోంది. వేతనాల చెల్లింపుపై ఇప్పుడున్న ఆడిటర్లు అభ్యంతరం వ్యక్తం చేశాక కొత్తగా వచ్చే ఆడిటర్లు ఈ వ్యవహారంపై దీనికి భిన్నంగా నిర్ణయం తీసుకుంటారా అన్నదానిపై చర్చ సాగుతోంది.

టెండర్‌కు వెళ్తామన్న కమిషనర్

2024లో కూటమి ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులను విధుల్లోకి తీసుకునే విషయంలో యాంత్రీకరణపై దృష్టి పెట్టాలని ప్రభుత్వ ఆదేశాల్లో సూచించిందని, మదనపల్లె మున్సిపల్ అధికారులు ఆ విధంగా చర్యలు తీసుకోలేదన్నది ఆడిటర్ ప్రధాన అభ్యంతరంగా కనిపిస్తోంది. ప్రభుత్వ సూచనను పక్కనపెట్టి దినసరి కార్మికులను ఎలా నియమించుకుంటారన్నది ఆడిటర్ లేవనెత్తిన ప్రశ్నకు అధికారుల నుంచి సరైన సమాధానం లేదని సమాచారం. దీనిపై గత డిసెంబర్‌లోనే పారిశుద్ధ్య పనుల నిర్వహణకు టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్‌కు అప్పగిస్తామని కమిషనర్ ఆడిటర్‌కు లిఖితపూర్వకంగా లేఖ రాసినట్టు చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఆడిట్ రికార్డుల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేశారని తెలిసింది. తర్వాత టెండర్ ద్వారా పనులు అప్పగింత జరగకపోవడంతో కార్మికులకు వేతనాలు ఎలా మంజూరు చేస్తామన్న ఆడిట్ అభ్యంతరంతో ఐదునెలలుగా వేతనాలు ఆపేశారు.

పర్మినెంట్ ఆశలు లేనట్టే

కూటమి ప్రభుత్వం వచ్చాక 80 మంది దినసరి పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ కార్మికులుగా నియమించుకుంటారని ఆశలు రేకెత్తించారు. ఆర్థిక భరోసా లేక చిన్నపాటి ఉద్యోగంతో కుటుంబాలు పోషించుకునే కార్మికులు శాశ్వత కార్మికులైపోతామని ఆశించారు. సాక్షి కథనంతో వాస్తవాలు వెలుగులోకి రావడంతో శాశ్వత కార్మికులుగా అయ్యే అవకాశం లేదని తెలిపోవడంతో ఆశలు వదులుకున్నారు.

కార్మికుల న్యాయం చేయాలి

ఐదునెలలుగా వేతనాలు లేకున్నా పని చేస్తున్న దినసరి పారిశుద్ధ్య భవిష్యత్తు ఏమిటి అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే వేతనాలు అందక కుటుంబాలు గడవడం కష్టంగా మారింది. పరిస్థితుల్లో మార్పు వచ్చి వేతనాలు అందితే కార్మికులకు ఊరట దక్కుతుంది. లేదంటే వేతనాలు లేకుండా ఇంకెన్ని నెలలు పని చేయాల్సి వస్తుందో అని మధనపడుతున్నారు. అధికారులు స్పష్టమైన చర్యలు చేపట్టి కార్మికులకు న్యాయం చేయాల్సి ఉంది.